జూలై - ఆగష్టు, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

ఈ స్వాతంత్ర్యము
అనుగ్రహించి, క్రీస్తు మనలను
స్వతంత్రులనుగా చేసియున్నాడు.



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

క్రీస్తునందు ప్రియమైన స్పర్శ పాఠకులకు ప్రభువు నామములో వందనములు. అంతా బావున్నారు కదా ! ఎన్ని ఇబ్బందులు, సమస్యలు ఉన్నా మనము అంతా దేవునిలో సంతోషంగా ఉండాలని ప్రభువును బట్టి వేడుకొనుచున్నాను. నిరీక్షణ లేని ఇతరుల వలె దేనిని బట్టి కూడా మనము దుఃఖపడకూడదని దేవుని వాక్యము సెలవిచ్చుచున్నది.

ఈ విద్యాసంవత్సరములో పిల్లలు నూతన తరగతులలోకి ప్రవేశించి, వారి చదువులు కొనసాగించుచున్నారు. వారు చక్కగా చదువుకోవాలని ప్రార్థించెదము. అంత మాత్రమే కాకుండా దేవునికి, దేశమునకు ప్రయోజనకరముగా ఉండాలని ప్రభువుకు అప్పగిద్దాము.

స్పర్శ ద్విమాస పత్రికను చదువుచున్న మీరంతా లోకములో దైవజ్ఞానము లేక పరుగులు పెడుతున్న ఇతరుల వలె కాక, మనచుట్టూ కనిపించుచున్న మనుష్యులు ఉన్నారని ఎంతగా నమ్ముచున్నామో, బాహ్యనేత్రములతో చూడలేకపోయినా ప్రభువు ఆత్మయై జీవించుచున్నాడని, ఏ సమయములోనైనా, ఎంతమందికైనా ఆయన సహాయం చేయగలడని విశ్వసించగలిగితే అన్ని విషయములకు ఆయనను చాలిన దేవుడిగా మనము కనుగొనగలము. కనిపించేవి అన్నీ అశాశ్వతములని, అదృశ్యమైనవి శాశ్వతములని బైబిలు గ్రంథము స్పష్టంగా తెలియపరచుచున్నది.

దేవుడు అచంచలమైన విశ్వాసముతో స్పర్శ పాఠకులను నడిపించును గాక !

మీ సహోదరుడు.....

జూలై - ఆగష్టు, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- ఇండిపెండెన్స్ ........ 2
- నాకే స్థలము లేదు ........ 5
- కన్నీటితో... (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- కార్పెంటర్ వర్క్ షాప్ ........ 10
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 17వ భాగము ........ 12
- ప్రాణమున్న వజ్రం (బాలల శీర్షిక) ........ 14
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 16
- రూపాయి, యూరో, డాలర్, పౌండ్ ........ 18
- ఆత్మ గాథ ........ 19
- నజరేతు కొండ, గొల్గొతా కొండ ........ 21
- బైబిల్ క్విజ్-17 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070. Ph: 040-24202227 Cell: 9666666249

# ఇండిపెండెన్స్

- బ్రదర్. ఎపఫ్రా

మన దేశం ఇంచుమించు 64 సం॥ల క్రితం పరాయి దేశస్థుల పరిపాలనలో ఉండేది. అప్పుడు దేశ ప్రజలు తమ ఇష్టాలు చేయడానికి ఎంత మాత్రం వీలుపడేది కాదు. ఒక రకంగా చెప్పాలంటే దేశంలోని ప్రజలంతా దాస్యంలో బ్రతుకుచున్నారన్న మాట. మన దేశ ప్రజలలో అనేక మంది స్వాతంత్ర్యం కొరకు ఎన్నో పోరాటాలు చేసి, అనేకమంది మరణించి స్వాతంత్ర్యం రావడానికి కృషి చేశారు. ఇది దేశ ప్రజలందరి బాహ్యా సంబంధమైన స్వాతంత్ర్యమైతే, సమస్త మానవాళి యొక్క అంతరంగ స్వాతంత్ర్యం అంటే ఏమిటి?

ప్రతి మనుష్యుడు జన్మించిన తోడనే దాస్యం ఏలుబడి చేయుచున్నది. కారణం దేవుడు మానవుని సృజించినప్పుడు ఏ దాస్యం లేనివాడిగా సృష్టించాడు. ఆ మొట్ట మొదటి మానవుడు ఎంతో స్వేచ్ఛగా, సంతోషంగా కాలం గడుపుతూ ఉండేవాడు. తన చేతులతో నిర్మించిన దేవాధి దేవుడు  కూడా ఎన్నడూ వానిని దాసుడిగా చూడలేదు కానీ ఆ మొట్ట మొదటి మానవులైన ఆదాము, హవ్వలు దేవుడు చెప్పిన మాటను వినక అవిధేయులై ఆజ్ఞను అతిక్రమించటం జరిగింది. వారి అవిధేయత వలన నేడు మనుష్యులందరిపైన దాస్యం అనేది ఏలుబడి చేయటం ప్రారంభించింది. ధర్మకార్యములు చేయుట, బలులు అర్పించుట మనుష్యులను బానిసత్వంలో నుండి విడిపించలేకపోయింది. ఒక మనుష్యుడు తప్పు అని తెలిసినప్పటికి దానిని చేయకుండా ఉండటానికి కావలసిన శక్తి చాలక తాను ఏది వద్దు అనుకుంటున్నాడో దానినే చేస్తూ తన మీద తనకు నియంత్రణ లేనట్టుగా కనపడుచున్నాడు. దానినే దాస్యపు బ్రతుకు బ్రతకడం అనవచ్చు. దీని విషయమై రోమా 7:18,19లో పౌలు ఇలా వ్రాసాడు. **“నా యందు, అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును, మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుట లేదు. నేను చేయగోరు మేలు చేయక చేయ గోరని కీడు చేయుచున్నాను”.** అంటూ పౌలు తన నిరాసక్తత వెల్లడిపరిచాడు. సృష్టించిన సృష్టి కర్త మానవాళి యొక్క దాస్యపు జీవితములను చూచి, మన యెడల జాలిపడి తన అనాదికాల సంకల్పం ద్వారా దాస్యం నుండి విడిపించాలని నిర్ణయించడం జరిగింది. ఆయన కాకుండా ఈ సృష్టిలో ఏ నామము, దేవుడు లేక దేవతలు అనబడిన వారు మానవాళి యొక్క ఈ దయనీయమైన పరిస్థితి నుండి విడిపించలేకపోయారు. యేసుక్రీస్తు పుట్టుకకు కొన్ని వందల సంవత్సరముల పూర్వము యెషయా గ్రంథంలో విడుదల కలిగించటానికి, విముక్తి ప్రసాదించటానికి **రక్షకుడు రాబోవుచున్నాడని** భవిష్యత్తుని గురించి వ్రాయబడి ఉంది, యెషయా 61:1

ప్రభువైన యేసుక్రీస్తు వచ్చిన తరువాత దేవాలయానికి వెళ్లినప్పుడు చదువుటకు యెషయా గ్రంథం చేతికి ఇవ్వబడింది. గ్రంథమును తెరిచినప్పుడు చెరలో ఉన్నవారిని విడిపిస్తావు అని వ్రాయబడిన వాక్యభాగము చేతికి రావడం జరిగింది. ఈ రీతిగా దేవుని ఉద్దేశ్యం బయలు పరచబడింది. ఆయన ఉద్దేశించిన రీతిగానే ప్రభువు కన్య మరియ గర్భంలో నుండి లోకానికి వచ్చి జన్మ, కర్మ పాపాలు లేనివాడిగా జీవించి, మానవాళి పాపపు శిక్షను తానే భరించి మనుష్యులందరి మీద ఉన్న దాస్యపు కాడి విరగగొట్టడం జరిగింది (రోమా 8:21). దాస్యములో బ్రతుకుచున్న ప్రతి ఒక్కరికి సహాయము చేయువానిగా మన ఎదుట ఉన్నాడు. ఎందరు ఆయన యందు విశ్వాసముంచుదురో వారి నందరిని స్వేచ్ఛా, స్వతంత్రత గలవారిగా మార్చడం జరుగుతుంది. వేల సంవత్సరములుగా మానవాళిపై ఉన్న దాస్యపు శిక్ష తీసివేయబడింది.



మన ధ్యాన భాగములో దేవుడు అనుగ్రహించిన స్వాతంత్ర్యతలో స్థిరముగా నిలవాలని, అంతే కాకుండా మరల దాస్యమనే కాడి క్రింద చిక్కకూడదని అపో.పౌలు హెచ్చరించుచున్నాడు. మనలను దాసులుగా మార్చుకొని, దాస్యము చేయించుకోవాలని సాతాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాడు. మనలను దాసులుగా చేసికొనవలెనని, క్రీస్తుయేసు వలన మనకు కలిగిన మన స్వాతంత్ర్యమును వేగు చూచుటకు రహస్యముగా తేబడి దొంగతనముగా ప్రవేశించిన కపట సహోదరుల వలన జరిగినది. గలతీ 2:4

వాడు ఉపయోగించని పద్ధతి అంటూ ఏదీ ఉండదు. అనేక విధములుగా మనలను శోధించి, దాస్యములో చిక్కుకొనేటట్లు చేసి తద్వారా వాడికి, వాడి దూతలకి సిద్ధపరిచిన నిత్యాగ్నిగుండములోనికి తీసుకొని వెళ్ళవలెనని ఎదురుచూడని క్షణం ఉండదేమో! మరొకప్రక్కన పరిశుద్ధాత్ముడు మనలను దాస్యమనే కాడి క్రింద చిక్కుకొనకుండా చేయడానికి ఎంత సహాయము మనకు అవసరమో, అంత సహాయము చేయడానికి సిద్ధంగా ఉంటాడు. దుష్టుని చేతిలో నుండి తప్పించుకొనుటకు ఆత్మానుసారంగా నడుచుట, ఆత్మచేత నడిపించబడుట ఎంతో ప్రాముఖ్యమైనవి. ఈ సంగతులు గలతీ 5:16,18లలో చూడగలుగుతాము.

ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, బాప్తిస్మం పొందిన ప్రతివారికి ఎల్లప్పుడూ సహాయ పడుటకు వారితో, వారిలో ఉండుటకు పరిశుద్ధాత్ముడు పంప బడియున్నాడు. నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీ కనుగ్రహించును, లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు, మీరు ఆయనను ఎరుగుదురు, ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును.(యోహాను 14:16,17) దీనిని బట్టి ఎంతో ధైర్యము తెచ్చుకొనవచ్చును.

(2 కొరింథీ 3:17) ఆత్మ ఎక్కడ ఉండునో అక్కడ స్వాతంత్ర్యము ఉండును అను వాక్యము కూడా మనలను ఎంతో ప్రోత్సాహపరుస్తుంది. మన బ్రదుకు దినములన్నిటా దాస్యమనే కాడి క్రింద చిక్కుకొనకుండా స్థిరముగా నిలిచి, స్వతంత్రులుగా జీవించే భాగ్యమును దేవుడు అనుగ్రహించును గాక!

## ముఖ్య గమనిక:

**ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు ప్రారంభించడం జరిగినది.
ఉదయం 10.30 గం॥ల - సాయంత్రం 6.30 గం॥ల వరకు
మీ ప్రార్థనావసరతలకై సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భార్గలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

# నాకే స్థలము లేదు



అది ఒక ఆహ్లాదకరమైన ఆదివారపు ఉదయకాలము. దేవుని మందిరము ఆరాధనకు వస్తున్న ప్రజలతో నింపబడుతూ ఉన్నది. మందిరములోనికి ప్రవేశించిన ప్రతి ఒక్కరికి ఒక పేపర్ ఇవ్వబడుచున్నది. దానిలో ఏ ప్రసంగం చెప్పబడుచున్నది, ఏ పాటలు పాడతారు, ఎవరు ప్రార్థన చేస్తారు? అనే విషయములు ప్రింట్ చేయబడి ఉన్నాయి.

అనేక దినముల నుండి స్నానము చేయకుండా, ముడుతలు పడిన ముఖముతో, మురికి బట్టలు వేసుకొని చాలా దినముల నుండి షేవింగ్ కూడా చేసికొననట్లుగా కనబడుతున్న ఒక పెద్దమనిషి ఆ మందిరము చివరి వరుసలో నిలబడి ఉన్నాడు. ఇంతలో ఆ మందిరపు పరిచారకులలో ఒక వ్యక్తిని చూచి గౌరవముతో తల మీద ఉన్న టోపీ తీశాడు. ఆ పెద్దాయన తల వెంట్రుకలు ఎంతో మురికిగా, పొడవుగా ఉన్నాయి. పాదములకు చెప్పులు కూడా లేవు. చిరిగిపోయిన సాక్సులు ధరించియున్నాడు. ఆ పరిచారకుడు ఇది చూచి తన ముక్కు మూసుకొని, ఆ పెద్దాయనతో ఇలా అన్నాడు. ఓ! క్షమించండి సార్ , మీరు లోపలికి వస్తుంటే నేను ఎంతో భయపడ్డాను. మీరు ఇలా లోపలికి వెళ్తే, సంఘస్థులు డిస్ట్రబ్ అవుతారు. ఆరాధనని డిస్ట్రబ్ చేసే వారిని మేము లోపలకు పంపించము, నాకు భయమేస్తుంది, దయచేసి వెళ్ళిపొండి.

ఆ పెద్దాయన ఒకసారి తనని తాను పై నుండి క్రిందకు చూచుకొని తన తల నుండి తీసిన టోపీని ధరించుకొని వెళ్ళిపోవడానికి వెనుదిరిగాడు. దేవునిని స్తుతిస్తూ పాడుతున్న పాటలు, చిన్నపిల్లలు స్టేజ్‌మీదకి వచ్చి పాడుతున్న చిన్న చిన్న పాటలు వింటూ బయట ఉండిపోయాడు. ఇంతలో ఫాదరిగారు బోధిస్తుండగా, తన జేబులో ఉన్న బైబిల్ తీసి ఆ వాక్యములను అండర్‌లైన్ చేసుకున్నాడు. అది వింటూ, వాక్యమును ఎంతో గౌరవిస్తున్న వ్యక్తిగా ఉన్నాడు.

ఆ స్థలమును వదిలి వెళ్ళలేక, చర్చి బయట ఉన్న పెద్ద రాతి మీద కూర్చున్నాడు. అక్కడ కూర్చుని నేను చర్చి లోపల అందరితో కలిసి ఉంటే ఎంత బాగుండేది. తాను వారితో కలిసి ఉండే అవకాశం లేకపోయిందే అని తనలో తాను విచారిస్తున్నాడు.

కొన్ని నిమిషములు మౌనంగా గడిచిపోయాయి. అంతలో అకస్మాత్తుగా అతని

వెనుకకు ఒక యౌవనస్థుడు రావడం జరిగింది. పెద్దాయన వెనుకకు తిరిగి చూస్తూ ఉంటే ఆయౌవనస్థుడు ఇలా అడిగాడు. **మీరు ఇక్కడ ఏమి చేస్తున్నారు?** నేను చర్చికి వెళదామని వచ్చాను. కానీ వాళ్ళు నేను మురికిగా ఉన్నానని తలంచి, నా వస్త్రములు పాతబడినవని చూచి, వారి ఆరాధనని ఆటంకపరుస్తానేమోనని భయపడి లోపలికి రానివ్వలేదు.

క్షమించాలి, నన్ను నేను మీకు పరిచయం చేసుకోలేదు. నా పేరు జార్జ్ అని పెద్దాయన అన్నాడు. ఇద్దరూ ఒకరి చేతులు ఒకరు కలిపారు. ఆ యౌవనస్థుడి తలవెంట్రుకలు కూడా పొడవుగానే ఉన్నాయి. అతను ధరించిన వస్త్రము చిరిగి, పీలికలు వ్రేలాడుతున్నాయి. అరిగిపోయిన చెప్పులతో ఉన్నాడు. ఆ యౌవనస్థుడు జార్జ్ భుజము తట్టి ఇలా చెప్పాడు. జార్జ్! నిన్ను లోపలకు రానివ్వలేదని ఏమీ బాధపడకు, నా పేరు యేసు నేను ఎన్నో సంవత్సరములుగా ఈ చర్చిలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నాను కానీ ఇప్పటి వరకు వాళ్ళు నన్ను లోపలకు రానివ్వలేదు.

దేవుని దృష్టిలో ప్రతి మనుష్యుడు ఎంతో విలువైనవాడు. మనం ఏర్పరచుకొనిన పద్ధతులు, నియమములు మనుష్యులను దేవునికి దూరం చేయడానికి కాదు. విచారించదగిన విషయం ఏమిటంటే ఈ రోజున సంఘములలో అనేక నియమ, నిబంధనలతో మనుష్యులను విసిగిస్తూ, స్థాయి, భేదములను చూపించి మనుష్యులను అవమానపరుస్తూ, దేవుని నుండి దూరం చేయడం జరుగుతుంది.

అవసరమైనది ఒక్కటే **మనుష్యులను పాపం నుండి దూరము చేయడం అది కేవలం క్రీస్తు ప్రేమ వలననే సాధ్యమవుతుంది.**


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - హైదరాబాద్‌లో జరిగే ఆరాధన స్థలములు:**

1. భాగ్యలత కాలని, **వనస్థలిపురం**
2. హెచ్.యం.టి., **చింతల్**, జీడిమెట్ల
3. **అనాజ్‌పూర్**, రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర
4. అరుల్ కాలని, ఎ.ఎస్.రావు నగర్, **ఇ.సి.ఐ.ఎల్**

**వివరములకు :**
**సెల్ : 9666666249 | ఫోన్: 040-2420 2227**

# కన్నీటితో...

- సిస్టర్ విజయ

**యేసు - అమ్మా యెందుకు ఏడ్చుచున్నావు ?**
**ఎవనిని వెదకుచున్నావు. - యోహాను 20:15**

క్రొత్త నిబంధనా గ్రంథములో చెప్పబడిన స్త్రీలలో **మగ్ధలేనే మరియను** ఒక ప్రత్యేకమైన మరియు అత్యున్నతమైన స్త్రీగా గుర్తించవచ్చును. యేసుక్రీస్తు శరీరధారిగా ఉన్న దినములలో మగ్ధలేనే అనబడిన మరియను పట్టిన ఏడు దయ్యముల నుండి విడిపించెను. ఆయన దేవుని రాజ్య సువార్తను తెలుపుచు, ప్రకటించుచు, ప్రతి పట్టణములోను, ప్రతి గ్రామములోను సంచారము చేయుచుండగా కొంతమంది స్త్రీలైన వారు, ఇతరులనేకులును తమకు కలిగిన ఆసక్తితో ఆయనకు ఉపచారము చేయుచూ ఆయనతో కూడా ఉండిరి. ఆ స్త్రీలలో మగ్దలేనే మరియ కూడా ఉన్నట్లుగా బైబిలు గ్రంథము చెప్పుచున్నది. ప్రభువైన యేసుక్రీస్తు సిలువ వేయబడిన తరువాత విశ్రాంతి దినము గడిచిన తరువాత ఆదివారము ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్ధలేనే మరియ ప్రభువును చూచి, ఆయన దేహమునకు సుగంధద్రవ్యములను పూయవలెనని వెళ్ళి అక్కడ సమాధి మీద రాయి తీయబడి యుండుట చూచెను. ఆమె సమాధిలోకి వంగి చూచుచూ ఆయన కనబడక పోవుట చూచి ఏడ్చుచుండెను.



మరియ యేసయ్య మీద ఎంత ప్రేమను కలిగి ఉన్నదో దీనిని బట్టి మనకి అర్థమవుతుంది. ఏదైనా మేలు, మంచి కార్యము జరిగితేనే ఆయనను ప్రేమించుట కాదు కానీ నా పాపముల కొరకు ఆయన సిలువలో మరణించారు, నశించిపోయే నన్ను రక్షించి ఆయన కృపలో నడిపిస్తున్నారు అని గ్రహించిన వారమైతే మన చివరి శ్వాస వరకు ఆయనను ప్రేమిస్తూనే ఉంటాము. వారిద్దరి మధ్య ఉన్న ప్రేమను బట్టి ప్రభువు ఏమయ్యారో అని ఆమె ఏడుస్తుండగా, ఆమె ఎందుకు ఏడుస్తుందో ప్రభువుకి తెలిసిననూ ఆయన ఆమెను వదిలివేయక **అమ్మా! యెందుకు ఏడ్చుచున్నావు** అని ఆదరణ కలుగునట్లుగా అడుగు చున్నారు.

మన జీవితములలో ఏ నిమిషములో ఎటువంటి ఆటుపోట్లు, సమస్యలు, మార్పులు కలుగుతాయో ఊహించలేము. కొన్ని ప్రభువు మనలను పరీక్షించడానికి కలిగితే, మరికొన్ని మన బాధ్యతను నిర్వర్తించకపోవుట చేత కలుగుతాయి. మన జీవితములో కలిగే ప్రతి పరిస్థితి ఆయనకు తెలుసు. మనము తప్పిపోయి, బలహీనతలలో పడిపోయేది కూడా

ప్రభువుకు తెలుసు. కుటుంబ బాధ్యతతో ఉండవలసిన యజమానులు వ్యసనములతో బంధించబడి, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటే, కుటుంబమును ఏ విధంగా నడిపించుకోవాలో తెలియక కొంతమంది, యౌవ్వన బిడ్డల తిరుగుబాటు స్వభావముల వలన కలిగే అసమాధానములు కుటుంబములో రాజ్యమేలుతుంటే ఏమి చేయాలో తెలియక కొంతమంది, ఆర్థిక సమస్యలతోను, అనారోగ్య పరిస్థితులతో శరీరము సహకరించక భారముగా దినములను గడుపుతూ ఇంకొంత మంది, చివరి శ్వాస వరకు దేవునిలోనే జీవించాలని, ఆయన ప్రేమ నుండి ఏదీ వేరు చేయకూడదనే ఆశని కలిగి ఉన్ననూ, జయించలేని ఆత్మీయ బలహీనతల నుండి విడుదల పొందాలని మరి కొంత మంది నిస్సహాయ స్థితిలో కన్నీరు కారుస్తూ ఉంటే, మన ప్రభువైన యేసుక్రీస్తు **అమ్మా! ఎందుకు ఏడ్చుచున్నావు** అని అడుగుచున్నారు. ఎంత ప్రేమ కలిగిన మాట ప్రియమైన వారలారా! అనగా మన కన్నీరుని ఆయన చూచుచున్నారు అని దీనిని బట్టి అర్థమవుచున్నది. మనకి ఉన్న పరిస్థితులు ఎలాంటివైనప్పటికి దేవుని వైపు కన్నీటితో చూచినప్పుడు, మనలను విడువక ఎంతగానో ప్రేమించుచున్న దేవుడు న్యాయబద్ధంగా, వాస్తవంగా ఆయన సన్నిధిలో విడిచిన కన్నీటిని వ్యర్థము చేయరు.

దేవుని ప్రేమ కలిగిన మనుష్యులే మన కన్నీటిని చూచి, చలించిపోతుంటే దేవాధి దేవుడైన యేసయ్య తప్పక మన కన్నీటిని చూచి, కనికరపడతారు. విడిచిపెట్టక ప్రతిఫలమును ఇస్తారు. మన యెడల ఆయన కలిగి ఉన్న ప్రేమకు ఏమిచ్చి ఋణము తీర్చుకోగలము? ఆయనపై ఎంత ప్రేమను మనము కలిగి ఉంటున్నాము? ఏదైనా పెద్ద సమస్య, భరించలేని బాధ కలిగినప్పుడు, నాకు మేలులేమీ జరగలేదు అని దేవునిని దూషించి, సణిగి ఆయన మార్గములను విడిచే వారిగా ఉన్నామా? దేవుని కృప, సహాయముతో మాత్రమే ఆయన మీద అమితమైన విశ్వాసముతో ముందుకి వెళతాను అనే ఆలోచనతో సాగుతున్నామా? నిర్ణయము మనదై ఉండాలి. ఎందుకనగా ఏ విషయమున కైననూ కుటుంబములో స్త్రీకి స్పందించే తీరు అధికంగా ఉంటుంది. సంతోషకరమైనదైతే మనస్సులో మాటి మాటికి జ్ఞాపకం చేసుకుంటూ మైమరిచిపోతుంది, దుఃఖకరమైనదైతే తనలో తానే వేదనతో లోలోపల రోదిస్తూ కుమిలిపోతుంది.

కొంతమంది ఏదైనా బాధ, సమస్య కలిగిన వెంటనే మనుష్యుల వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్ళి వారి దగ్గర బాధపడి, ఏడుస్తూ ఉంటారు. కానీ కనబడుచున్న వ్యక్తి కంటే వ్యక్తిత్వ, దైవ విలువలు కలిగి ఎల్లప్పుడు మనకి సహాయం చేసే దేవుని చేతులలో ఉండడానికి ఇష్టపడి, ఆయన సన్నిధికి వెళ్ళి వేడుకునే వారిగా ఉండాలి. మనకి బాధ కలిగి, ఒంటరిగా ఉన్న సమయములలో మనకు సహాయం చేయడానికి తన దూతలకు ఆజ్ఞాపించే తండ్రిని మనము కలిగి ఉన్నామని మరువద్దు.

బైబిల్‌గ్రంథములో మరికొంత మంది స్త్రీలు కార్చిన కన్నీటి ద్వారా ఆయన కనికరమును పొంది, చనిపోయిన తమ వారిని బ్రతికించుకో గలిగారు. బేతనియ గ్రామములోని మరియ, మార్త, లాజరు అను వారి కుటుంబములో లాజరు చనిపోయి సమాధిలో ఉంచబడ్డాడు. 4 దినముల తరువాత ప్రభువు ఆ ప్రాంతమునకు వచ్చినప్పుడు మరియ యేసు ఉన్న చోటికి వచ్చి ఆయనను చూచి ఆయన పాదముల మీద పడి ప్రభువా, నీవిక్కడ ఉండిన యెడల నా సహోదరుడు చావకుండు ననెను. ఆమె ఏడ్చుటయు ఆమెతో కూడా వచ్చిన యూదులు ఏడ్చుటయూ యేసు చూచి, కలవరపడి ఆత్మలో మూలుగుచూ లాజరుని ఎక్కడ ఉంచితిరని అడిగెను. యేసు కన్నీళ్ళు విడిచెను. లాజరుని సమాధిలో నుండి బయటకు రమ్మని పిలిచి సజీవుడిగా నిలిపెను.





నాయీను అను గ్రామములో ఒక విధవరాలి కుమారుడు చనిపోయి పాతిపెట్టడానికి తీసుకువెళుతుండగా ఆ తల్లి కన్నీటిని చూచిన యేసు ప్రభువు కనికరపడి, ఏడ్వవద్దని చెప్పి, పాడె ఆపి అతనిని ముట్టి సజీవుడిగా ఆమెకి అప్పగించారు.

పాత నిబంధనా గ్రంథంలో హన్నా తనకి కలుగుచున్న అవమానములు, నిందలు హేళనలను బట్టి దేవుని సన్నిధిలో తన హృదయమంతటిని క్రుమ్మరించి పడిన బాధ, కార్చిన కన్నీరు అక్కడ దేవుని యాజకుడిగా ఉన్న ఏలీ నుండి ఒక వాగ్దానము పొందుకొనేటట్లుగా చేసింది. ప్రతిఫలముగా దేవుని నుండి కుమారుడిని పొందుకుంది.



చూశారా! సహోదరీలారా! యేసయ్య కనిపించలేదు అని ఆయన మీద ప్రేమతో కన్నీరు కార్చిన మరియ ప్రపంచమునకు పునరుత్థానమును మొదటిగా ప్రకటించిన మొట్ట మొదటి స్త్రీ అయ్యింది. చనిపోయిన సహోదరుడిని మరియ మార్తలు, చనిపోయిన కుమారుడిని విధవరాలు సజీవులుగా తిరిగి పొందుకోగలిగారు. హన్నా యొక్క కుమారుడైన సమూయేలు గొప్ప ప్రవక్తగా ఇశ్రాయేలు దేశములో నిలిచాడు.

కనుక కన్నీటిని తుడిచి, అద్భుతములను వారి జీవితములలో జరిగించిన దేవుడు నిశ్చయముగా మనలను ఆదరించి కన్నీటిని తుడిచి ప్రతిఫలమును కలుగజేస్తారు. కాబట్టి ప్రార్థించి, సంతోషమును కలిగి ఉండుడి.

అట్టి సంతోషమును దేవుడు మనకి అనుగ్రహించును గాక !

# కార్పెంటర్ వర్క్ షాప్



ఒక వర్క్‌షాప్‌లో ఉన్న టూల్స్ అన్నీ ఒకరోజున జనరల్ బాడీ మీటింగ్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. దానికి సుత్తిగారు ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ ఉండగా మిగిలిన టూల్స్ అన్నీ సుత్తితో మీరు ఎంతో శబ్దమును పుట్టిస్తారు గనుక వెళ్ళిపొండి అని అనడం జరిగింది. అప్పుడు

**సుత్తి :-** నేను ఈ కార్పెంటర్ వర్క్ షాపు నుండి వెళ్ళిపోతే నాతోపాటుగా రంధ్రం చేసే పనిముట్టు కూడా వెళ్ళిపోవాలి. ఎందుకనగా ఇక్కడ ఇది చేసే పని ఏముంది చిన్న రంధ్రం వేయడం తప్ప.



**ఇంతలో రంధ్రం వేసే పనిముట్టు కలుగజేసుకొని**

**రంధ్రం వేసే పనిముట్టు :-**

ఆల్‌రైట్! స్క్రూడ్రైవర్ కూడా వెళ్ళిపోవాలి.

అనేకసార్లు దాని చుట్టూ అది తిరగడం తప్ప చేసేదేముంది.



**స్క్రూడ్రైవర్ టూల్స్ కిట్‌లో ఉన్న అందరి వైపు చూస్తూ**

**స్క్రూడ్రైవర్ :-** మీరు వెళ్ళిపొమ్మంటే వెళ్ళిపోతాను కానీ చిత్రిక కూడా వెళ్ళిపోవాలి. పైపైన చెక్కడం తప్ప లోతుగా పనిచేయడం దానికి చేతకాదు.



**చిత్రిక :-** సరే, రంపం కూడా వెళ్ళిపోవాలి. ఏమైనా మార్పులు, చేర్పులు చేయవలసి వస్తే లోతుగా కట్ చేయడం తప్ప మరి ఏమీ చేయలేదు.



**రంపం ఈ విధంగా ఫిర్యాదు చేసింది**

**రంపం: -** కొలబద్ద చేసే పని ఏముంది? నేను ఒక్కదానినే కరెక్ట్ అనుకొని, అన్నిటిని కొలవడం తప్ప, కాబట్టి కొలబద్ద వెళ్ళిపోవాలి.

**కొలబద్ద అన్నిటిని పర్యవేక్షిస్తూ...**



**కొలబద్ద :-** ఈ పనితో ఏ మాత్రం సంబంధం లేని శాండ్‌పేపర్ ఇక్కడ ఎందుకు? పైకి కనిపించేంత స్మూత్‌గా లోపల ఎప్పుడూ ఉండదు. అంతేకాకఅడ్డదిడ్డంగా రుద్దడం తప్ప అది చేసేది ఏముంది? కాబట్టి తప్పకుండా అది వెళ్ళిపోవాలి.

సంభాషణల మధ్యలో నజరేతు వాడైన వడ్రంగి లోపలికి వచ్చి, ఆ దినపు పనిని ప్రారంభించాడు. తన పని చేయడానికి కావలసిన పనిముట్లు అన్నిటిని ఒక బల్ల మీద పెట్టి పుల్‌ఫిట్‌ను తయారుచేశాడు. కొలబద్ద, రంపము, చిత్రిక, సుత్తి, రంధ్రము చేసే పనిముట్టు, స్క్రూడ్రైవర్, శాండ్‌పేపర్ మరియు ఇతర పనిముట్లను ఉపయోగించుకొని ఒక చక్కని పుల్‌ఫిట్‌ని తయారుచేసి ఆ దినపు తన పనిని ముగించి, కార్పెంటర్ ఇంటికి వెళ్ళాడు. ఒక దాని మీద ఒకటి ఫిర్యాదు చేసుకున్న ప్రతి పనిముట్టు మాట వాస్తవమే కానీ అది ఏ పనిముట్టు అయినప్పటికి దానిలో ప్రతి దానిని ఉపయోగించి, వడ్రంగి తన పనిని పూర్తి చేశాడు. ఒకటి చేసిన పనిని మరియొకటి ఏ మాత్రమూ చక్కగా చేయలేవు.

కాబట్టి ప్రియమైన వారలారా! మనమందరము యేసయ్య టూల్‌బాక్స్‌లోని పనిముట్టులమై యున్నాము. మనలో ప్రతి ఒక్కరమూ ఒక ఉద్దేశ్యము, సామర్థ్యము మరియు చేయడానికి పని కలిగియున్నాము. మేము దేవుని జత పనివారమై యున్నాము, **మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునైయున్నారు.** (1 కొరింథీ 3:9)

## ఉపవాస ప్రార్థన

ఉపవాస ప్రార్థన - 2011, **ఆగష్టు 15వ** తేది (సోమవారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
కావున పాల్గొని దేవుని దీవెనలు పొందగలరు.

వివరములకు:

**9666666249**
**040-24202227**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 17వ భాగము**

మరియొక సందర్భములో ఎంతో తీవ్రమైన అనారోగ్యముతో బాధపడుచు దాహముతో ఉన్న ఓ బ్రాహ్మణుని ఒక రైల్వేస్టేషన్ దగ్గర చూచాడు. అయితే అచ్చటి స్టేషన్ మాష్టారు ఒక కప్పులో నీళ్ళు తెచ్చి ఇవ్వగా త్రాగడానికి అతడు నిరాకరించాడు. విదేశానికి చెందిన పాత్రలో నీళ్ళు తెచ్చినందున ఆ పాత్రని అతడు తృణీకరించాడు. తన స్వంత ఇత్తడి పాత్రలో పోసి ఇచ్చేంత వరకు అతడా నీళ్ళు ముట్టలేదు.

కాబట్టి హైందవుడైన వానికి అతడు అంగీకరించే పాత్రలో జీవజలములనిస్తే అతడు ఎంతో ఇష్టంగా దానిని అంగీకరిస్తాడు. సాధువులను భారతీయులు బాగా ఎరుగుదురు. గనుక విదేశీయుని కంటెను, పాశ్చాత్య పద్ధతిలో జీవిస్తూ సాధారణ రీతిగా సువార్త నందించాలని కోరే భారతీయుల బోధ కంటే ఈ సాధువులుగా ఉండే వారి మాటలనే వారు త్వరగా వింటారు. నీళ్ళలో ఎలాంటి తేడా లేదు గాని తేడా అంతా దానిని అందించే పాత్రలోనే ఉంది. పాత్ర అంగీకారంగా ఉంటే జీవజలమును వారు అంగీకరించే అవకాశం మరింత అధికంగా ఉంటుంది. తన మొదటి సువార్తయాత్రలో బెలూచీస్థాన్ ద్వారా ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు వరకు వెళ్ళాడు సుందర్. ఆ తరువాత కైబరు కనుమల మధ్యనున్న దారి గుండా ఆఫ్ఘన్‌లోనే అడుగుపెట్టాడు. ఆ తరువాత మరల ఇక్కడికి వచ్చావంటే చంపేస్తామని సుందర్‌ను బెదిరించారు. అయితే దేవుని ఎడతెగని సన్నిధి ఆయనకు తోడుగా ఉండి తనకు వ్యతిరేకముగా లేచిన ఉప్పెనను అణిచి వేసింది.

తరువాత జలాలాబాద్ నగరం చేరాడు సుందర్. యేసుప్రభువును ఒక ప్రవక్తగా ఎంచే ఆ మహమ్మదీయులు యేసుప్రభువు దేవుడని చెప్పక ముందు వరకు ప్రశాంతంగానే విన్నారు. కానీ ఆ తరువాత వారి మనస్సు ఒక్కసారిగా మారిపోయింది. బాహాటంగానే శత్రువుల్లా ప్రవర్తించ నారంభించారు. త్వరగా వెళ్ళిపోలేదంటే చంపేస్తామని హెచ్చరించారు. చీకటి పడుతూ ఉంది. మధ్య ఆసియా నుండి పశువుల మందలను తోలుకొని వచ్చేవారు రాత్రివేళల్లో తమ మందలతో బాటు విశ్రాంతి తీసుకునే కొట్టంలో మాత్రమే తనకు ఆశ్రయం దొరుకుతుంది గనుక అచ్చటికే వెళ్ళాడు. ఎముకలు కొరికే చలి నుండి తప్పించుకునే మార్గం లేదక్కడ. అంతేగాక వర్షం కురుస్తూ ఉంది. నిద్రించడానికి సుందర్

ప్రయత్నించినప్పటికిని చలి, వర్షం కూడబలుక్కొని నిద్రను దూరం చేశాయి. తెల్లవారగానే లేచి అచ్చట ఉన్న చలిమంట దగ్గర చేరి తన బట్టలని ఆరబెట్టుకుంటూ ఉన్నాడు సుందర్. అలా రావడం కనబడింది. ఆ క్షణంలో సుందర్ ఎంత భయపడ్డాడో చెప్పలేము. తనను చంపడానికి తీసుకొని పోయేందుకు వీరు రాలేదు గదా అని సుందర్ ఆశ్చర్యపడ్డాడు. అయితే దానికి భిన్నంగా వారు వచ్చి అక్కడే నిలబడి ఎంతో ఆశ్చర్యంతో సుందర్‌ని చూస్తూ ఉన్నారు. వాడసలు బ్రదికి ఉండడు. ఒకవేళ బ్రతికినా చావుబ్రతుకుల మధ్య పడియుండి లేవడానికి కూడా శక్తి లేకుండా ఉంటాడని తలంచి వచ్చిన వారికి యౌవనుడైన సుందర్ ఆరోగ్యంగా ఉండి తన బట్టలను ఆరబెట్టుకుంటూ కనబడడంతో అదిరిపోయారు.

అయితే ఇంతకంటే మించిన దానినే వారు చూచి ఉంటారు. వారు చూచిన రూపం వారిని భయభ్రాంతులను చేసింది. ఏది యేమైననూ వారు అలాగే నిలబడి మాట్లాడుకున్నారు. వారిలో ఒకడు ముందుకు వచ్చి సుందర్‌కు వంగి సలాం చేశాడు. ఇప్పుడు ఆశ్చర్యపడడం సుందర్ వంతు అయ్యింది. ఈ చలికి, వర్షమునకు బయట ఉండడం వలన నీవు చనిపోయే ఉంటావని, లేదంటే మేమే నిన్ను చంపాలని వచ్చామని అతను సుందర్‌తో చెప్పాడు. అయితే సుందర్‌ని సజీవంగాను, ఆరోగ్యంగాను చూడడంతో అల్లాయే అతనిని కాపాడాడని వారు తలంచారు. దీనిని బట్టి తాను అందించాలని వచ్చిన దైవసందేశమును తమకు అందించమని వారు సుందర్‌ని కోరారు. ఆశ్చర్యకరంగా పరిణామం చెందిన ఈ సంఘటన వలన సుందర్‌ని చంపాలనుకున్న నాయకుడైనవాని ఇంట్లోనే ఓ వారం రోజులు అతిథిగా ఉన్నాడు సుందర్. సుందర్‌కి వారి భాష రాదు గనుక ఎంత మేరకు ప్రయోజనకరమైన రీతిగా వారికి సువార్త నందించాడో తెలియును గాని సుందర్ యెడల వారి అభిప్రాయం మాత్రం పూర్తిగా మారిపోయింది. వారు అల్లా అని పిలుచుకునే దేవుడే సుందర్‌ని కాపాడాడు అని వారు గుర్తించారు. తన దాసుడైన సుందర్‌తో ఉండిన దేవుని సన్నిధి అతని ఆంతర్యములో శక్తిని కలిగించి అతనికి గౌరవం కలిగించింది. అవి అతని శత్రువులను అణిచివేసి తనను గౌరవించే విధంగా చేశాయి. ఇలాంటి కార్యములు ఇంకా ఎన్నో మార్లు జరగబోనున్నాయి.

మొదటి సువార్తయాత్ర ముగించుకున్న సుందర్ సబాతుకు తిరిగి వచ్చాడు. ఇక్కడ నుండి వెళ్ళినప్పటి కంటే ఇప్పుడు ఎంతో సన్నబడి పోయాడు. అయితే ఆ ప్రాంతంలో తనకి ఎంతో పరిచయమైన ఆశ్రయం దొరికినందుకు ఎంతో సంతోషించాడు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)

# ప్రాణమున్న వజ్రం



పిల్లలూ! బావున్నారా! బాగా చదువుతున్నారా! మంచి Bag, Uniform లేదని, ఇంకా Books కొనలేదని సణుగుకుంటున్నారా? మీ Parents మీకు ఏదీ తక్కువ చేయరు అన్నీ అందించాలని చాలా తాపత్రయ పడతారు. పరిస్థితులను బట్టి మీకు కావలసినవి ఒకవేళ అందుబాటులో లేకపోతే "ఛీ! ఈ కొంపలో పుట్టడం నా దురదృష్టం" అని తిట్టుకోకండి. ఈ పోటీ ప్రపంచంలో మీ కన్నవారు మీ కోసం ఎంత కష్టపడుతున్నారో అర్థం చేసుకుంటే బాగా చదువుకోగలరు.

సామాన్యంగా కుటుంబాలలో మంచి క్రమశిక్షణతో విద్యనభ్యసించే వారిని చూచి రత్నాల లాంటి బిడ్డలు, వజ్రం లాంటి కుర్రాడు అని పొగుడుతూ ఉంటారు. తల్లిదండ్రులు అలాంటి విద్యాబుద్ధులు కలిగిన పిల్లల్ని చూచి గర్వపడుతూ ఉంటారు. వారే తమకి గొప్ప ధనంగా, ఐశ్వర్యంగా భావిస్తారు.

అనగనగా ఒక ఊరిలో వజ్రాల శెట్టి అనే వ్యాపారి ఉండేవాడు. పేరుకు తగినట్లే వజ్రాల వ్యాపారం చేసేవాడు. తన పిల్లల కంటే వజ్రాలే విలువైనవని వాటిని బట్టి చాలా గర్వించేవాడు. తనని మించిన ధనవంతుడు లేడనే గర్వంతో అందరినీ తృణీకరించేవాడు. దారిన పోయే వారినందరినీ పిలిచి "నువ్వెప్పుడైనా వజ్రాలను చూశావా? వజ్రం ఖరీదెంతో తెలుసా?" అని అడిగేవాడు. పాపం వాళ్ళు తాము ఎప్పుడూ వజ్రాన్ని చూడలేదని నిజం చెప్పేవారు.

"అవున్లే! వజ్రం చూసిన ముఖం కాదు నీది. దేనికైనా పెట్టిపుట్టాలి. నేను వజ్రాల్లో పుట్టి వజ్రాల్లో పెరిగాను. లక్షల ఖరీదునుంచి కోట్ల ఖరీదు చేసే వజ్రాలు నా దగ్గరున్నాయి. దేశ విదేశాల నుంచి ఎందరో వచ్చి నా దగ్గర వజ్రాలు కొనుక్కుపోతారు అని గర్వంగా చెప్పుకుంటూ ఇతరులని హేళన చేసేవాడు వజ్రాలశెట్టి. ఈ కారణం వల్ల చాలామంది వజ్రాలశెట్టి ఉంటున్న వీధినుంచి వెళ్లడం కూడా మానుకున్నారు.

ఇలా ఉండగా ఆ ఊరికి జ్ఞానం అనే మాస్టారు కొత్తగా వచ్చి ఎందరినో తన దగ్గర శిష్యులుగా చేర్చుకున్నాడు. ఒక రోజున ఆయన వజ్రాలశెట్టి వీధిలోంచి వెళ్లడం జరిగింది. పాపం ఆయనకు శెట్టి విషయం తెలీదు. క్రొత్తవారి కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్న శెట్టికి ఆయన దొరికిపోయాడు. యథాప్రకారంగా వజ్రాలశెట్టి జ్ఞానం మాస్టారును కూడా హేళన చెయ్యడం మొదలుపెట్టాడు.

జ్ఞానం మాస్టారు చాలా తెలివైనవారు. శెట్టి గర్వాన్ని వెంటనే పసిగట్టాడు. అతనికి బుద్ధి చెప్పాలనీ అతనిలో జ్ఞాన దీపాన్ని వెలిగించాలనీ అనుకున్నారు. అందుకే నెమ్మదిగా

వజ్రాలశెట్టితో, శెట్టిగారూ! మీ దగ్గర ఉన్నవన్నీ చాలా చవకబారు వజ్రాలు, వాటిలో ప్రాణం లేదు. నా దగ్గర ప్రాణమున్న వజ్రాలు ఉన్నాయి. ప్రాణం లేని వాటికంటె ప్రాణముండి చైతన్యంతో కదిలే వజ్రాలు మరింత గొప్పవి కదా! అయితే ఆ వజ్రాలన్నీ నావి కాదులెండి. నేను వజ్రాలను సాన బెట్టడంలో నేర్పరినని చాలామంది తమ దగ్గరున్న ముడి వజ్రాలను తెచ్చి సానపెట్టమని నాకు అప్పగించి వెళుతుంటారు. దేవుడు నాకు కూడా ఒక వజ్రమిచ్చాడు. ఆ వజ్రమెంత గొప్పదంటే నా ఎత్తు ధనమిచ్చినా దాన్ని నేను ఎవరికీ అమ్మను అన్నారు. శెట్టికి ఏమీ అర్థం కాలేదు. ఆ రాత్రి నిద్రపట్టలేదు.

శెట్టి ఉదయంకాగానే మాస్టారు ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాడు. ఆ ఇల్లు సాదా సీదాగా ఉంది తప్ప ఆ ఇంట్లో వైభవం కనబడ్డం లేదు. మాస్టారు తన కుమారుడికి ఏవో పాఠాలు నేర్పిస్తూ కన్పించాడు. అతని ముఖంలో ఎంతో ప్రశాంతతను చూశాడు శెట్టి. మాస్టారూ! ఏదీ మీ ప్రాణమున్న వజ్రాన్ని చూపించండి, నేను దానిని పరిశీలించి విలువైనదో, కాదో చెబుతాను అన్నాడు.

“ఇదిగో ఇప్పుడు చూస్తున్నారే ఈ కుర్రాడు – వీడు నా కొడుకు. వీడే నా అసలైన వజ్రం. రేపు దేవునికి, దేశానికి పనికి వచ్చే వజ్రం. దీన్ని నేనిప్పుడు సానబెట్టే పనిలో నిమగ్నమైయున్నాను. ఇలాంటి ఎన్నో వజ్రాలను తీసుకొచ్చి నాకు శిష్యులుగా చేశారు ఈ ఊరి ప్రజలు. నేను వాటినన్నిటినీ రోజూ సానబెట్టి దేవునికి, దేశానికి పనికివచ్చే విధంగా మార్చి ఉజ్వలంగా కాంతులీనేలా చేస్తున్నాను” అన్నారు మాస్టారు.

ఆ మాటలకి వజ్రాల శెట్టికి జ్ఞానోదయం కలిగింది. ఇన్నేళ్లుగా తాను పోగుచేసిన వజ్రాలు వట్టి రాళ్లు, మనిషి విలువనిస్తేనే వాటికి విలువ కానీ, ఇలాంటి చిన్నారులే నిజమైన వజ్రాలు. వీటికి ఒకరు విలువనివ్వక్కర్లేదు ఇవి స్వయం ప్రకాశాలు. ఇలాంటి వజ్రాలను సానబడుతున్న మాస్టారు దేవుని తర్వాత అంతటివాడు అనుకున్నాడు. వెంటనే శెట్టి తన దగ్గర ఉన్న వజ్రాలలో సగం అమ్మి వచ్చిన డబ్బును శిష్యులకు జ్ఞానం నేర్పడానికి ఉపయోగించమని మాస్టారుకు విరాళంగా ఇచ్చేశాడు.

చూశారా పిల్లలూ! జ్ఞానం మాస్టారు దగ్గర ధన సంపదలు లేకపోయినా ఆయన కలిగియున్న జ్ఞానం తన కుమారునికి మాత్రమే కాకుండా తన యొద్దకు వచ్చే ఎంతో మంది పిల్లలకు ప్రయోజనకరంగా ఉంది. జ్ఞానంలేని ధన సంపదలు గర్వించడానికి తప్ప దేనికీ ఉపయోగపడవు. మీరు కూడా మీ పేరెంట్స్‌కి వజ్రాల వంటి వారు. మీరు బాగా చదువుకుని దేవునికి, దేశానికి ఉపయోగపడాలని వారి తపన. మీకు అన్నీ సమకూర్చి చదివిస్తున్నప్పుడు మీరు ఎంతో శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు గర్వకారణంగా... ప్రాణమున్న వజ్రాలుగా ఉంటారని ఆశిస్తూ.....

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

- రాజ్‌కుమార్, బొమ్మలూరు

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు వందనములు. నా పేరు రాజ్‌కుమార్, మాది కృష్ణాజిల్లా, బాపులపాడు మండలము, బొమ్మలూరు గ్రామము. నాకు ఒక అక్క, ముగ్గురు సహోదరులు, నామకార్థ క్రైస్తవ కుటుంబములో ఉన్న నేను ఆచారమైన భక్తి చేస్తూ ఉండేవాడిని. ఆర్.సి.ఎమ్ చర్చికి వెళ్ళుచూ అక్కడి పద్ధతులను, ఆచారములను పాటిస్తూ, నేను మంచి భక్తుడిని అని నాలో నేను తలంచుకుంటూ జీవిస్తూ ఉండేవాడిని. నేను క్రైస్తవుడిని అనుకుంటూనే చదువుకునే సమయములలో అనేకసార్లు సినిమాలు చూస్తూ, అల్లరితో కూడిన ఆటపాటలతో నా జీవితం కొనసాగిస్తూ కూడా నేను భక్తి చేస్తున్నాను అని నన్ను నేనే హెచ్చించుకుంటూ, అందరిని దూషిస్తూ ఉండేవాడిని. జోసఫ్ తంబి, మేరీ మాత ఉత్సవములకు క్రమం తప్పకుండా వెళ్ళుచూ మనుష్యులు చేసుకున్న సున్నపు విగ్రహాలకు మ్రొక్కుతుండేవాడిని. తద్వారా విచక్షణను కోల్పోయి, మూర్ఖత్వంతో వేరొక డినామినేషన్స్ వారిని నా నోటితో ఇష్టం వచ్చినట్లుగా దూషించుచూ, భయంకరమైన అంధకార సంబంధమైన స్థితిలోనికి నడిపించబడ్డాను.

ఈ విధంగా కొనసాగుతున్న నా జీవితములో పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోయిన తరువాత అనుకొనని సంఘటన జరిగి జీవితములో తిరిగి కోలుకోలేని పరిస్థితులలోనికి వెళ్ళిన సమయములో నేను హైదరాబాద్‌కి వచ్చాను. వచ్చిన రోజు అర్థరాత్రి దాటే వరకు బ్రదర్ జోసఫ్‌తో అనేకమైన విషయములలో వ్యతిరేకముగా తర్కించాను. అయినా అతను విసుగు లేకుండా చెప్పి నన్ను మన ఎపఫ్రా మినిస్ట్రీస్ లోనికి నడిపించాడు. అప్పుడు నేను ప్రార్థనకు వస్తూ ఉండేవాడిని కాని, మనస్సు మాత్రం మారలేదు. బ్రదర్ ఎపఫ్రా గారు ఒకసారి నాతో మాట్లాడి నీ గురించి సేవకులు దేవునికి లెక్క అప్పజెప్ప వలసి వచ్చినప్పుడు ఏమి చెప్పాలి అని అడిగితే నా నుండి సమాధానం రాలేదు. అప్పుడు నేను నా మనస్సు మార్చుకొని, బాప్తిస్మం తీసుకోవడం జరిగింది. అప్పటి నుండి దైవసేవకులు చెప్పిన వాక్యము ప్రకారము జీవించడం మొదలుపెట్టిన తరువాత నా జీవితములో అనేక మార్పులు జరిగాయి. తరువాత ఉద్యోగము ఏమీ దొరకకపోవడంతో అన్నీ సర్దుకొని ఇంటికి వెళ్ళిపోయాను. అక్కడ ఆత్మీయంగా వెనుకకు వెళ్ళి, జీవితం ఎలా కొనసాగుతుందో తెలియని పరిస్థితులలో మరల అన్నీ సర్దుకొని హైదరాబాద్ వచ్చాను. మంచి ఉద్యోగము దొరికి, వివాహమై జీవితములో స్థిరపడతానో లేదో అని అనుకున్న సమయములో మినిస్ట్రీస్‌లో జరిగిన ఉపవాస ప్రార్థనలలో సమస్యలన్నిటిని వ్రాసి, వాటి కోసం ప్రార్థన

చేయమని వేడుకోవడం జరిగింది. ఆ ఉపవాస ప్రార్థనలలో దైవసేవకులు, మినిస్ట్రీస్‌లో ఉన్న సంఘముల వారు కన్నీరు విడిచి చేసిన ప్రార్థనల ద్వారా సమస్యలు అన్నింటి నుండి విడిపించబడి, వివాహం చేసుకొని దేవునిలో సమాధానముగా, సంతోషంగా జీవితమును కొనసాగిస్తున్నాను. ఒక బాబును కూడా దేవుడు అనుగ్రహించారు. అంతేకాక నా ఉద్యోగములో ప్రమోషన్ వచ్చి జీతము పెరగడానికి దేవుడు ఎంతో సహాయం చేశారు. కాబట్టి దేవుని యందు విశ్వాసముంచి, ఎన్ని సమస్యలు, శోధనలు ఎదురైననూ ఆయనలో నిలిచి ఉంటే ఎంతగా మేలు చేసి జీవితమును స్థిరపరుస్తారో నేను నా జీవితములో అనుభవించాను.

ఈ విధంగా ఎన్నో అద్భుతమైన కార్యములు చేసి, నా జీవితములో నన్ను స్థిరపరిచినందుకు దేవునికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు చెల్లించుచున్నాను.

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు, ప్రసంగముల సి.డి.లు కావలసినవారు ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు.**

---

మా చిరునామా: **ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227, సెల్: 9666666249



# రూపాయి, యూరో, పౌండ్, డాలర్



**ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను, నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము (1 తిమోతి 6:9,10)**

గత రెండు సంచికల నుండి ధనాపేక్షవలన కలిగే నష్టమును గురించి తెలుసుకుంటూ వచ్చాము. గత సంచికలో ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలో చిక్కుకుంటారు అనే విషయమును ధ్యానించుకున్నాము. ఇప్పుడు ధనవంతులు అవ్వాలి అనే అపేక్ష ఉరిగా ఎలా మారుతుందో నేర్చుకుందాము.

**ధనాపేక్ష వలన కలిగే ఉరి :-**

ఉరి అనే మాటని మనం గ్రహిస్తే, తిరిగి బయట పడలేనిది అనే సంగతి మనకి జ్ఞాపకం వస్తుంది. ఉరి అనేది ఏ మనుష్యుని జీవితములో కూడా సంభవింప కూడనిది. కానీ నేటి దినములలో అనేకులు ధనవంతులగుటకు అపేక్షించి ఇక ఎంత మాత్రమూ బయటికి రాలేక జీవితములను వ్యర్థపరచు కొనుచున్నారు. తేలికగా వచ్చే మనీ (ఈజీమనీ) కొరకు వెంపర్లాడుచూ ఘోరముగా మోసపోవుచున్నారు. కష్టపడకుండా డబ్బులు సంపాదించాలి అనే దురాశపరులను మోసగించడమే వారి ఉద్యోగాలుగా వేలమంది ఈ దేశంలో పని చేస్తున్నారంటే మీరు నమ్మగలరా !

1. అధిక వడ్డీల కొరకు ఆశపడి అసలు కూడా పోగొట్టుకొనేవారు.
2. ఇంటర్నెట్‌లలోను, సెల్‌ఫోన్స్‌లోను మీకు లాటరీ వచ్చింది అనే మెసేజ్‌లను గ్రుడ్డిగా నమ్మి కోట్లాది రూపాయలు వస్తాయని వేలు లేక లక్షల రూపాయలు వారి చేతులలో పెట్టి మోసపోతున్న వారు.
3. అధిక కట్నములకు ఆశపడి, వివాహ విషయములో తప్పుడు నిర్ణయములు తీసుకొని బాధపడుచున్న వారు.
4. జూదము, గుర్రపు పందెములు, క్రికెట్ బెట్టింగ్స్‌లలో సమస్తమును పోగొట్టుకొని, ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు.
5. ధనాపేక్షతో నరహత్యలు చేస్తూ, జీవితములను పాడు చేసుకుంటున్నవారు.
6. కష్టపడకుండా వచ్చే సంపదను గూర్చి మనము బహు జాగ్రత్త కలిగి యుండాలి. రావాలి అని ఆశించుట కానీ, వస్తుంది అంటే నమ్ముట కానీ మనము చేయకూడదు. మన బ్రదుకు దినములన్నిటా ధనవంతులగుటకు అపేక్షించి, తద్వారా కలిగే ఉరిలో పడకుండా ఎవరికి వారే జాగ్రత్త కలిగి ఉండాలి. అపో.పౌలు తన ప్రియమైన సేవకుడగు తిమోతితో ధనాపేక్ష ఉరిగా మారుతుంది అనే విషయమును ఎంతో స్పష్టంగా తెలియపరిచాడు. కాబట్టి ధనాపేక్ష మన జీవితములకు ఉరిగా మారకుండా బహు జాగ్రత్త కలిగి బ్రతకాలి.

అట్టి ధన్యతను దేవుడు దయచేయును గాక !

# ఆత్మ గాథ

ఒకానొక సమయంలో **"ఆత్మ"** అను పేరు గల మనుష్యుడు తోటలో నడుచుకుంటూ వెళ్ళుచూ, తన రక్షణ వలన కలిగిన ఆనందముతో పాటలు పాడుకుంటూ ఉన్నాడు. అతను నూతనముగా మారుమనస్సు పొందిన వ్యక్తి. ఆత్మ నడుస్తూ ఉండగా అందము, ఆకర్షణ కలిగిన స్త్రీ చెట్టు చాటు నుండి బయటకు రావడం కనిపించింది. ఆత్మ ఒక్కసారే ఉలిక్కిపడి హలో ! నేను **"ఆత్మ"**ని నీ పేరేంటి ? అని అడిగాడు.

నన్ను **"మోహము"** అంటారు నేను నీకు కావలసిన దానిని అని సమాధానం చెప్పింది.

**ఆత్మ :** నాకు నువ్వు ఎలా కావలసిన దానివి ?

**మోహము :** శరీర సంబంధ వాంఛలన్నీ తీర్చుకోవచ్చు

**ఆత్మ :** సరే, నన్ను నడిపించు

అప్పుడు శరీర సంబంధ వాంఛలన్నీ తీర్చుకోవడానికి మోహము సహాయపడింది.

ఆ తరువాత ఆత్మ తోటలోకి తిరిగి వచ్చినప్పుడు దోషారోపణ చేసే వ్యక్తిని కలుసుకోవడం జరిగింది.

**దోషారోపణ :** ఏయ్ ! నా ఫ్రెండ్ మోహముని నీవు కలుసుకున్నావా ?

**ఆత్మ :** అవును, నీవెవరివి ?

**దోషారోపణ :** నేను దోషారోపణని, మోహము తరువాత నేను వస్తాను. మేమిద్దరము ఒకరి చేయి ఒకరము కలుపుకొని పనిచేస్తాము.

దోషారోపణ ఆత్మ వీపు పైకి ఎక్కి కొట్టడం ప్రారంభించాడు. ముఖం మీద పిడిగుద్దులు గుద్దాడు. ఇలా కొన్ని దినములు జరిగాయి. సుమారుగా 3 దినముల తరువాత కనికరము పరిగెత్తుకుంటూ వచ్చి, ఆత్మను కొట్టడం ఆపమని దోషారోపణని గద్దించాడు. దోషారోపణ చూసుకుందాము రా అని అంది. అప్పుడు కనికరం తన ఒరలో నుండి కత్తిని తీసి, దోషారోపణని రెండు ముక్కలు చేసింది. ఆత్మ పరిశీలిస్తూ ఉండగానే తనలో ఉన్న బాధని కనికరము చేత ఆశ్చర్యంగా జయించడం జరిగింది.

కనికరము ఆత్మ దగ్గరికివెళ్ళి దోషారోపణని నేను ఎప్పుడో జయించాను. అది నీకు ఎన్నడూ కనిపించదు.

**ఆత్మ :** నేను నీకు ఎలా కృతజ్ఞతలు తెలపాలో తెలియడం లేదు.

**కనికరం :** మంచిది, ఇక్కడికి నేను దేవుని చేత పంపబడ్డాను. ఆయన నా స్నేహితులను నీకు పరిచయం చేయమని చెప్పాడు. అతని పేరు "విడుదల"

**విడుదల :** హలో! ఆత్మ అంటూ దగ్గరకి వచ్చి నీవు సరిగా ఉండలేకపోతున్నావు కదా! అని అడిగాడు.

**ఆత్మ :** నిన్ను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది

**విడుదల :** నాకు కూడా నిన్ను కలుసుకోవడం సంతోషంగా ఉంది. నీవు నన్ను అంగీకరిస్తావా !

**ఆత్మ :** ఏమంటున్నావు?

**విడుదల :** నీవు యేసయ్యని అంగీకరించినప్పుడు, ఆయనతో నడవాలని నిర్ణయించు కున్నావు. తరువాత ఆయన ప్రేమను, ఆజ్ఞలను అంగీకరించావు. నేను ఆయన ప్రేమలో భాగమును. క్షమించబడ్డాను అనే భావమును నేను కలిగిస్తాను. ఇక నీవు ఎన్నడూ దోషారోపణ చేత బాధించబడవు. మోహము నీ చుట్టు తిరిగినప్పటికి, నాలాంటి మరో వ్యక్తి నీకు సహాయం చేస్తాడు అతని పేరు "కృప"

**కృప :** ఆత్మతో నడుస్తూ, నేను నీ కోసం ఎదురు చూస్తున్నాను నేనే కాదు, మేము ముగ్గురము నిన్ను కలవాలని ఎదురు చూస్తున్నాము. మోహము నుండి దూరము చేయడానికి నన్ను నీకు దేవుడు అనుగ్రహించాడు. చివరిగా మరొక వ్యక్తిని నీవు కలుసుకోవాలి అతని పేరు "విశ్వాసము"

**విశ్వాసము :** ఆత్మా! నేను విశ్వాసమును, నీవు బలపడడానికి, నీ నమ్మికలన్నీ దృఢపడడానికి నేను నీకు సహాయం చేస్తాను.

**ఆత్మ** ఏడవడం ప్రారంభించాడు.

ఇంతలో **విడుదల** ఈ విధంగా అంది : దీని కోసమే నీతో మేము ఉన్నాము. యేసు విడిపిస్తాడు, కృప చేత, విశ్వాసము ద్వారా రక్షిస్తాడు నీకు ఆయన కనికరముతో నిన్ను ప్రేమిస్తున్నారని ఆత్మతో చెప్పాడు.

**ఆత్మ :** **"నేను యేసుని ప్రేమిస్తున్నాను".**

మనం ఎంత బలహీనులమైనా, ఎన్ని అపజయాలు పొందినా దేవుని నుండి దూరంగా పారిపోకూడదు. ఏదేమైనా **ఆయన మనలను ప్రేమిస్తూనే ఉంటాడు.**




## నజరేతు కొండ

నజరేతు అనగా చిగురు, రక్షించునది. ప్రభువైన యేసు యొక్క తల్లి దండ్రులైన యోసేపు, మరియలు నివసించిన పట్టణము నజరేతు. ఈ పట్టణములోని కొంతమంది జనసమూహము ప్రభువైన యేసు చేయుచున్న అద్భుతములు, స్వస్థతలు, దయ్యములను వెళ్ళగొట్టబడుట వంటి కార్యములను చూచి ఆ పట్టణము కట్టబడిన కొండ చివరికి నిటారుగా ఉన్న స్థలము నుండి ఆయనను తలక్రిందులుగా పడద్రోయవలెనని తలంచిరి.

## గొల్గొతా కొండ

కల్వరికి హెబ్రూ పేరు గొల్గొతా. ఈ రెండింటికి ఒకటే అర్థము. కపాలస్థలము అను అర్థము నిచ్చు ఈ  కొండపై రక్షకుడైన ప్రభువైన యేసుక్రీస్తు సిలువ వేయబడ్డారు. ఇది యెరూషలేము ప్రాకారమునకు వెలుపల (బయట) ఉంది. ఆయన సిలువ వేయబడిన స్థలము పుర్రె యాకారముగా ఉన్నదని దాని శబ్దార్థము వలన తెలియుచున్నది.






# బైబిల్ క్విజ్ -17

(కొరింథీ పత్రికలో నుండి ఇవ్వబడినవి)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి**

1. నేను చేసిన ఈ అన్యాయమును క్షమించుడి. ఎవరు అన్నారు ?
2. మనమందరము ముసుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె దేని చేత ప్రతిఫలింప జేయుచున్నాము?
3. మీరు బుద్ధి విషయమై పసిపిల్లలు కాక దుష్టత్వము విషయమై ఎవరి వలె ఉండమని పౌలు అన్నాడు?
4. బలహీనమైన మనస్సాక్షి గలవారిని నొప్పించుట వలన మనం ఏమి చేసిన వారమగుచున్నాము?
5. నేను మిమ్మును ఎంత యెక్కువగా ప్రేమించుచున్నానో అంత తక్కువగా మీరు నన్ను ప్రేమింతురా? రిఫరెన్సు?
6. ఏ మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు?
7. దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట మనము ఎందులో పాలు పుచ్చుకొనినట్లు?
8. నా బలహీనతలయందే గాక వేరు విధముగా అతిశయింపను అని ఎవరు అన్నారు?
9. ఈ జీవిత కాలము మట్టుకే మనము క్రీస్తు నందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరి కంటె మనము ఏమైయుందుము?
10. వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈ సంగతులు మనకు ఏ విధంగా ఉన్నవి?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఆగష్టు 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు సెప్టెంబరు 2011 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా - ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**

**బైబిల్ క్విజ్ - 16 జవాబులు (రోమా పత్రికలో నుండి ఇవ్వబడినవి)**

1. కృప 3:24
2. పౌలు 7:24
3. ప్రార్థన చేయువారందరి యెడల 10:12
4. ప్రభువు వారమై యున్నాము 14:8
5. సుందరమైనవి 10:15
6. అతిశయపడాలి 5:4
7. ఆత్మ 8:26
8. అత్యధిక విజయము 8:37
9. పౌలు 7:18
10. రోమా 1:21

**బైబిల్ క్విజ్ - 16 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

కృప, చంద్రకళ, కోమలి, సుధారాణి, విజయ, ఐజాక్‌కుమారి, పద్మాకర్, పార్వతి, శాంతి

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జూలై - ఆగష్టు

**భాగ్యలత** : శారమ్మ, నిఖిల్ (మిర్యాలగూడ), రమేష్‌బాబు, సాత్విక్, గంగాధర్, సురేష్, రూఫస్, ప్రశాంత్ వర్మ, బుజ్జి, రాజేష్, ఎస్తేరు, రత్నం, దివ్య, రమ్య(మిర్యాలగూడ), ప్రభాకర్, ప్రసాద్, ప్రకాష్, దివ్యవాణి, తరుణి, విజయలక్ష్మి, నాంచారమ్మ, పాపారాణి, రాజేశ్వరరావు, వాణి, జ్యోతి, వీణ, శిరీష, జ్యోతి, సురేష్, ప్రసన్న, భారతి, రమాదేవి, ఆనంద్‌రెడ్డి

**చింతల్** : జీవన్, గణేష్, అఖిల, కోమలి, రవిబాబు, వెంకటేశ్వర్రావు, తేజ, శ్రీనివాసరావు, ప్రశాంతి, జశ్వంతరావు, నాగాంజనేయులు, షైని, విజయ, సుధాకర్, సుమంత్, శిల్ప, సోనీ, ఆనంద్‌పాల్, పరిశుద్ధరావు, రాము, శివ, భగత్‌వర్మ, ప్రభాకర్, అజయ్‌కుమార్, వెంకటలక్ష్మి, శ్యామ్‌కుమార్, నాగరాజు, వీణ, కాలేబు, విజయ, దీపిక, సత్యం, దీవెన, నిరీక్షణ్, వెంకటరమణ, అరుణ, శ్రీనివాస్, ఆనంద్‌బాబు, షీబారాణి, విజయ, చిట్టెమ్మ.

**అనాజ్‌పూర్** : షాలేమురాజు, సిద్ధు, మణి, జ్యోతి, సౌజన్య, విజయలక్ష్మి

**ఇ.సి.ఐ.యల్** : మాధవి, వెంకటేశ్వర్రావు, సుకుమార్

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

# బిల్లీ బ్రే



దేవుని కృపయే త్రాగుబోతు, అపవిత్ర జీవితములో ఉన్నవారిని మార్చి పరిశుద్ధ దేవుని కుమారుడైన క్రీస్తులో నిలిపి ఉంచేది. అట్టి కోవకు చెందిన వారిలో బిల్లీబ్రే ఒకరు.

బిల్లీబ్రే ఇంగ్లండు దేశములోని కార్న్‌వాల్ రాష్ట్రములో ట్వెల్వ్‌హెడ్స్ అను గ్రామములో 1794వ సం॥న జూన్ 1వ తేదీన జన్మించెను. బిల్లీ 17 సం॥ల వరకు తాతగారి గృహములో పెరిగి తరువాత పని నిమిత్తమై దూరప్రదేశమైన డెవన్‌షైన్ వెళ్ళెను. అచ్చట త్రాగుబోతుల సహవాసము పట్టి దుష్ట జీవితములోనికి దిగిపోయెను. ఇతని త్రాగుడు వలన అనేక అపాయములలో చిక్కుపడెను. అంతకంటే మరి లోతైన పాపములో దిగెను. నరక భయము చేత అనేకమార్లు "దేవా, నేనిక త్రాగను" అని తీర్మానములు చేసెను గాని, ఇంకను ఎక్కువ త్రాగెడివాడు. ఈ విధంగా 7 సం॥లు గడిచింది. వివాహమయ్యింది కానీ కుటుంబము గురించి బాధ్యత లేకుండా ఉండెను. అయితే బిల్లీ మనస్సాక్షి అతనిని దినమెల్లయు నిందించుచు, రాత్రులందు భయంకరమైన కలలతో భయపెట్టెడిది. ఇట్టి స్థితిలో అతనికి జాన్‌బన్యన్ రచించిన పరలోక దర్శనములు – నరక దర్శనములు అను పుస్తకము దొరకగా అతడు దానిని చదివెను. అప్పటి నుండి తాను మార్పు పొందవలెననే ఆశ అతనిని గట్టిగా పట్టుకొనెను. కాబట్టి వెంటనే పడక దిగి మోకాళ్ళ మీద మొదటిసారిగా ప్రార్థించెను. అప్పుడాయన మీద ప్రార్థనాత్మ దిగెను. జీవితాంతము అది అతనిని విడిచిపెట్టలేదు. మోకాళ్ళ ప్రార్థనలో గడిపి ఈ ప్రార్థనల వలన సాతానును ఓడించు శక్తిని పొందెను. 1832 వ సం॥లో బిల్లీ నూతన వ్యక్తిగా మార్పు చెందడం జరిగినది. తన తోటివారైన త్రాగుబోతుల యొద్దకు వెళ్ళి దేవుని కృపని, దేవుడు తన యెడల చేసిన గొప్ప కార్యమును చెప్పెను.

రక్షణ అనుభవము ఎంత లోతుగా ఉండునో అంతగా దేవుని శక్తి ఆ జీవితములో కనబడును. రక్షణ కొరకు బిల్లీలో కలిగిన పోరాటము సామాన్యమైనది కాదు. దాని ఫలితం పూర్ణ ఆత్మ విడుదల. బిల్లీ దేవునితో హృదయమంతటితో పెనుగులాడెను. దేవుడాయనను మహిమకరమైన జయముతో దీవించెను. ప్రసంగించు కృపను ప్రభువు బిల్లీకి ఇచ్చెను. చెప్పబడుతున్న సత్యము ప్రజలకు చక్కగా అర్థమయ్యెడిది. బిల్లీ తన హృదయమంతటితో దేవుని సేవించుటయే గాక తనకి ఉన్నదంతటిని సంతోషముగా దేవుని సేవ కొరకు వాడెను. తనకి ఉన్న కొంచెమును తనకంటే పేదలతో ఎప్పుడు పంచుకొనెడివాడు. ఇతరులకు మేలు చేయవలెనను ఆశతో నిమగ్నుడైయుండెను. దేవుని సలహాలు, హెచ్చరికలు, గద్దింపులు అందించుటకు భయపడలేదు.

1867వ సం॥నకు బిల్లీకి 74 సం॥లు నిండెను. విస్తారమైన సేవలో ఇంకను నిమగ్నుడైయుండెను. 1868వ సం॥ మే 22న ఆయన మరణించెను. చిరకాలము క్రీస్తుని సేవించిన సేవకులలో ఆయన ఒకడు. బిల్లీ సామాన్య వ్యక్తే అయినా, అతడు శ్రద్ధతో మనసంతటితో భక్తిని అవలంబించాడు. ఆయన జీవితము మనుష్యులను క్రీస్తు వైపునకు నడుపు శాశ్వతమైన జీవనజ్యోతి.

జూలై 4, 2011వ తేదీన ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీసు ప్రారంభోత్సవములో
మందిరపు పని కొరకు నియమింపబడిన పరిచారకులు పాల్గొని దేవునిని స్తుతించుట జరిగినది.









# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org